www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 డిసెంబర్ 2023

5

అన్నమయ్య

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఊరూరా తిరుగుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిధులు రూ.1.14 లక్షల కోట్లు దారి మళ్లించారని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు పెంచనని హామీనిచ్చి నేడు గద్దెనెక్కి విద్యుత్ ఛార్జీలను అధికంగా పెంచారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో ముస్లిం మైనార్టీలకు అందించిన రంజాన్ తోఫాతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలను దూరం చేశారని పేర్కొన్నారు. అమ్మఒడి పథకంలో రూ.2 వేలు తగ్గించి రూ.13 వేలకు కుదించారన్నారు. విదేశీ విద్య పేదలకు దూరమైందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, జాబ్ కేలెండర్ విడుదల చేస్తానని, డిఎస్సీ గుర్తులేనట్టు, సిపిఎస్ రద్దు వంటి అనేక హామీలను నిరుద్యోగులు, ఉద్యోగ-ఉపాధ్యాయులతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలు నీటిలో మూటలయ్యాయని పేర్కొన్నారు. అందరినీ నమ్మించి నట్టేట ముంచిన నమ్మకద్రోహి జగనేనన్నారు.

ఉత్తరాలతో అంగన్వాడీల నిరసన

బి.కొత్తకోట : ఉత్తరాలు చూపిస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. నిరసన కేంద్రంలో పోస్టు కార్డులను ప్రదర్శించడం, పోస్టాఫీసు వద్దకు వెళ్లి డబ్బాల్లో ముఖ్యమంత్రికి లేఖలు పంపే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెబాట తప్పదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రాజెక్టు కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి అన్నారు. సమ్మె బాటలో భాగంగా 17వ రోజు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు వేతనం పెంచాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టి రాయచోటి పట్టణ వీధులలో నిరసనగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెను మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 17 రోజులకు చేరిందని, అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు,గ్రాట్యూటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారని, ఇప్పటి వరకు దీనికి సంబంధించిన జిఓ ఇవ్వలేదన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించ కుండా సచివాలయ ఉద్యోగుల ద్వారా సెంటర్ల తాళాలు పగలగొట్టిస్తుండడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ సమ్మెకు లబ్ధిదారుల నుంచి అపూర్వ మద్దతు లభిస్తోందని చెప్పారు.ప్రభుత్వం అద్దెలు ఇవ్వకపోయినా గర్భిణులు, బాలింతలకు పోషణ అందించామన్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు విజయమ్మ, సిద్దమ్మ, నాగమణి, అరుణ, మస్రూన్ బీ, సుమలత, వనజ ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అంగన్వాడీల బాధలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చేరేలా రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ప్రతి అంగన్వాడీ మహిళ ఉత్తరాలు రాసి తపాలా ద్వారా విజయవాడ లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి పంపించారు. **బి.కొత్తకోట :** అంగన్వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె సందర్భంగా ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం, గ్రాట్యూటి అమలు, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించడం, నాణ్యమైన పౌష్టికాహారం సరఫరా చేయడం, హెల్పర్లకు ఉద్యోగోన్నతులు కల్పించడం తదితర సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొత్త కూరాకులపల్లి, బలకవారిపల్లె-1, కొండ్లపల్లి, బురకాయలకోట-2, యల్లప్పగారిపల్లి అంగన్వాడి కేంద్రాల టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి సిఐటియు ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి అన్నారు. లక్కిరెడ్డిపల్లి మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వెంటనే అంగన్వాడీల సమస్యలపై స్పందించి వేతనాలు రూ.26 వేలు ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె విరమించే ప్రసక్తి లేదదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ, సెక్టార్ లీడర్లు శ్రీవాణి, రుక్మిణి, ప్రభావతి, లక్ష్మీదేవి, సునీత, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

రాజంపేట : పోస్టు బాక్స్‌లో ఉత్తరాలు తపాలా ద్వారా పంపిస్తున్న అంగన్వాడీలు

వీఆర్ఎల సమస్యలు పరిష్కరించండి

ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వం విఆర్ఎల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో విఆర్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఎన్నికల వాగ్దానంగా అధికారంలోకి రాగానే కనీస వేతనం రూ.18 వేలు ఇస్తానని సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు సమక్షంలోనే చెక్కులు అందజేస్తానని చెప్పి నాలుగున్నర సంవత్సరాల తర్వాత కూడా ఒక్క రూపాయి పెంచలేదని పేర్కొన్నారు. సిఐటియు పోరాడి సాధించినరూ 300 డిఎ దాదాపు రూ.20 వేలు దాకా రికవరీ చేశారని, ముఖ్యమంత్రి రివర్స్ పాలన చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. తెలంగాణ మాదిరి ఫేస్కేల్ ఇవ్వాలన్నారు. డిఎ రూ.500 వేతనంతో కూడినది ఇవ్వాలన్నారు. నామినీలను విఆర్ఎలగా గుర్తించాలన్నారు. ఖాళీ పోస్టులు విఆర్ఓ, అటెండర్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, పోస్టులను వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాలన్నారు. 65 ఏళ్లు దాటిన వారికి నామిని పోస్టులు భర్తీ చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇంటి స్థలం, భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రికవరీ అమౌంట్‌ను కోర్టు ఆదేశాల ప్రకారం విఆర్ఎ ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలనే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, నర్రా రాఘవరెడ్డి స్థాపించిన సంఘం కాపాడుకొని, సిఐటియు ఎర్రజెండా కింద పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్ చంద్రశేఖర్, రాజంపేట రెవెన్యూ డివిజన్ అధ్యక్షులు కొరముట్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి మధు, కోడూరు మండల నాయకులు, లక్ష్మీకర్, రేవతి సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఓబులవారిపల్లి మండల నాయకులు ప్రసాద్, తిరుపాలు, పుల్లంపేట వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, చిట్వేలి నాయకులు రవికుమార్, చంద్రయ్య, పెనగలూరు మండల నాయకులు గిరిజ, మల్లి, నందలూరు మండలం నాయకులు శ్రీనివాసులు, రామచంద్రయ్య, రాజంపేట మండల నాయకులు, నరసింహులు పాల్గొన్నారు. అనంతరం ఏకకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. **రాయచోటి టౌన్ :** గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదుట గ్రామ సేవకులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకులను రెగ్యులర్ చేస్తానని, జీతం పెంచుతానని, పిఆర్‌సి అమలు చేస్తానని ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన తర్వాత పూర్తిగా విస్మ రించడం దారుణమని వాపోయారు. ఇచ్చిన డిఎను కూడా వెనక్కి లాక్కు న్నారని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ వెళు తుంటే గ్రామ సేవకులను బస్టాండ్, రైల్వేస్టేషన్లల్లో అరెస్టు చేయడం సరైందని కాదని వాపోయారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయనందునే నిరసన, ధర్నా చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. గ్రామ సేవకుల సంఘం జిల్లా కో- కన్వీనర్ జి భోగేశ్వరయ్య మాట్లాడుతూ నామినీలను విఆర్ఎలుగా, అర్హులైన వారికి ప్రమోషన్లు గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఆర్ఎ వ్యవస్థ లేకుండా చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో గ్రామ సేవకులు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. డిఎలు ఇవ్వాలని, రీ సర్వేలో పాల్గొంటున్న ప్రతి విఆర్ఒకూ టిఎతోపాటు డిఎ, ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలన్నారు. వేసవిలో తీవ్ర ఎండలకు రీ సర్వేలో పాల్గొని గుండెపోటుతో చనిపోయిన గ్రామ సేవకుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రతి ఒక గ్రామ సేవకునికి 2 ఎకరాల భూమి, 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలన్నాపరు. కార్యక్రమంలో గ్రామ సేవకులు నరసింహులు రాంమోహన్, నాగేందర్, శ్రీనువాసులు పాల్గొన్నారు.

రాజంపేట : ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

రాయచోటి : నిరసన తెలుపుతున్న విఆర్ఎలు

'మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె మూడో రోజు భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రాయచోటి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మూడో రోజు సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గడిచిన నాలుగున్నరేళ్లల్లో మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యల పరిష్కారం చేయాలని ప్రభుత్వ పెద్దలకు అభ్యర్థించి, వినతులు సమర్పించినా పరిష్కారం కానందున విసిగి వేసారి పోయిన కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సంద ర్భంగా 'ఒక సంవత్సరం ఓపిక పట్టండి మన ప్రభుత్వం వచ్చిన 6 నెలల లోపే కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన-వేతనం చెల్లిస్తామని' చెప్పిన మాటను గాలికి వదిలేశారని వాపోయారు. కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జిఓఆర్‌టి నంబర్ 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వర్కర్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మికులకు వేతనాలు పెంచుతామని మూడేళ్లుగా హామీలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. నాయకులు చెన్నయ్య రాంబాబు అగ్గిరా మయ్య మాట్లాడుతూ 10-15 ఏళ్లుగా నైపుణ్యంతో కూడిన పనులు నిర్వహి స్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లిం చకుండా ప్రభుత్వం దాగా చేస్తోందని వాపోయారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్పటికీ అమలుకి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాల విస్తీర్ణం, జనాభా పెరుగుదల దృష్ట్యా కార్మికులను పెంచడం లేదన్నారు. సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామన్న హామీని విస్మరిం చారన్నారు. ఈ సమ్మెతోనైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిద్దయ్య, శిద్ద ముల్లు, రవికుమార్, వై. వెంకటరమణ, మంగమ్మ, రమణమ్మ, పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా మూడవ రోజు మున్సిపల్ కార్మికులు పురపాలక కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. జనసేన పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ జన సైనికులతో కలిసి కార్మికులకు సంఘీభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్ ఓబయ్య, కార్మికులు లక్ష్మీదేవి, ప్రసాద్ రమణ, జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, పోలిశెట్టి రజిత, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రాయచోటి : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామ పంచాయతీ, కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎన్ఎంఆర్ సిబ్బందికి బకాయి వేతనాలు విడుల చేసి పనికి తగ్గ వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని, టెండర్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సురేంద్ర బాబు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఓ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న 57, 132, 680 జిఒలను అన్ని జిల్లాలలో అమలు చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 132. ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా అమలు చేయ లేదని వాపోయారు. స్వచ్ఛభారత్ కార్మికులకు కూడా పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని జీవో నెం 680 ప్రకారం ప్రతి కార్మికుడికీ రూ.10 వేల వేత నం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6 నెలల నుంచి 18 నెలల వరకు ఉన్న బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, గ్రామ పంచాయతీకార్మికుల సంఘం రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులకు. టెండర్లతో సంబంధం లేకుండా కార్మికులను విధుల్లో కొనసాగించాలని పేర్కొన్నారు. కార్మికులకు 2015 లో ఇచ్చిన హైకోర్టు తీర్పును అన్ని జిల్లాలలో అమలు చేయాలని ఆదేశాలు ఉన్నా అమలు చేయడం లేదని వాపోయారు. కలెక్టర్, డిపిఒ స్పందించి హైకోర్టు ఇచ్చిన సర్కులర్ ప్రకారం టెండర్ పద్ధతి లేకుండా విధుల్లో కొనసాగించాలని కోరారు. తెలిపారు. సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లాలని, ప్రభుత్వం స్పందిం చకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.శేఖర్ నాయక్, గోపాల్, ప్రమీల, శ్యామల, శంకర్, రెడ్డెయ్య, నాగమ్మ, ఆనంద్, శరమంద, కొండయ్య, రామాంజులు, నాగరాజు, సాయి, ఈశ్వరి, ఓబులేసు, అశోక్, పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

రాజకీయ ప్రతినిధులతో కలిసి ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇవిఎం గోడౌన్‌పై పటిష్టమైన నిఘా : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాకు సంబంధించిన ఇవిఎంలను భద్రపరిచిన గోడన్ వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను గురు వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. గోడౌన్ లోపల భద్రపరిచిన ఇవిఎం యంత్రాలు బియులు, సియులు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తంగా 4893 బియులు, 4220 సియులు, 4847 వివి ప్యాట్‌లు వచ్చాయని వీటన్నిటిని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే మొదటి దశ తనిఖీ పూర్తి చేసినట్లు తెలిపారు. 4817 బియులు బాగున్నాయని, 76 మరమ్మతుకు వచ్చాయని, 4140 సియులు బాగున్నాయని తెలిపారు. 80 మరమ్మతులకు, 4770 వివి ప్యాట్ బాగున్నాయని, 77 డిఫెక్ట్ ఉన్నట్లు పేర్కొన్నారు. లోపపూరితంగా ఉన్న బియులు, సియులు, వివి ప్యాట్‌లను వెనక్కి పంపినట్లు చెప్పారు. ఇవిఎం యంత్రాలకు కల్పించిన భద్రత పట్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తిని వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. కార్యక్రమం లో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, తహశీల్దార్ ప్రేమంత్‌కుమార్, ఎన్నికల సెల్ సూపరిం టెండెంట్ కృష్ణమోహన్, టిడిపి భానుగోపాల్‌రాజు, బిజెపి శివప్రసాద్, బిఎస్‌పి యుగంధర్, జనసేన రియాజ్, ఐయుఎంఎల్ ఎస్ఎస్ బాషా, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసే వరకూ సమ్మె కొనసాగిస్తాం

- 9వ రోజు నిరసనలో ఎస్ఎస్ఎ ఉద్యోగుల వంటావార్పు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎస్ఎస్ఎ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న సమ్మె 9వ రోజు వంటా వార్పు నిర్వహించారు. సమ్మె కాపీలను దహనం చేశారు. శిబిరాన్ని సందర్శించిన శ్రీనివాసులు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామి ప్రకారం ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, మరణించిన వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం, గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. అనంతరం మెమో పత్రాలను దహనం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన సమగ్ర శిక్ష ఉద్యోగుల హామీని అమలు చేయాలని వారు నినాదాలు ద్వార గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు, సిఐటియు నాయకులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, రమణ; నరసింహులు, సత్యనారాయణ, ప్రసన్న, మాధవయ్య ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వంటావార్పు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

భూ సేకరణను వేగవంతం చేయాలి : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి : పేదలకు భూ పంపిణీ చేసేందుకు భూసేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష తహశీల్దార్లకు సూచించారు. గురు వారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పేదలందరికీ అసైన్మెంట్ భూములు పంపిణీ చేసేందుకు జనవరి 3లోపు భూసేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. వాగులు, వంకలు, కొండలు, గుట్టలు, కాకుండా వ్యవసాయానికి ఉపయోగపడే భూములు గుర్తించాలని సూచించారు. ఆయా డివిజన్‌లలోని ఆర్‌డిఒలు ఎప్పటికప్పుడు తహశీల్దార్లకు సూచనలు జారీ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల సర్వేయర్ల సహకారంతో వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించాలని చెప్పారు. ఇందుకు సంబంధించి అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రభుత్వ నియమ నిబంధన మేరకు తహశీల్దార్లకు సహకరించాలని పేర్కొన్నారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి అసైన్మెంట్ భూములు గుర్తించి నివేదిక తమకు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్‌అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, తహశీసిల్దార్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి : 'మలిశెట్టి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : యువత అన్ని రంగాలలోనూ రాణించి శక్తివంతంగా ఎదిగి దేశ అభ్యున్నతి కోసం పాటుపడాలని జనసేనపార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. గురువారం వీరబల్లి మండలానికి చెందిన ఈడిగపల్లె, వడ్డిపల్లె యువకుల కోరిక మేరకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వారి గ్రామాలలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ సాధన కోసం మలిశెట్టి వెంకటరమణ ఇరుజట్ల కెప్టెన్లకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.20 వేలు క్రికెట్ కిట్‌ను చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఇండేన్ గ్యాస్ వద్ద గల తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, చదువు పట్ల మక్కువ పెంచుకొని, ప్రతి రోజూ వ్యాయామం చేస్తూ శరీరాన్ని ఆరోగ్యంగా, సౌష్టవంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన చేనేత వికాస రాష్ట్ర కార్యదర్శి రామయ్య, లీగల్‌సెల్ అధ్యక్షులు సుబ్బరాయుడు, రజిత, వడ్డిపల్లె క్రికెట్ జట్టు కెప్టెన్ బాలచంద్ర, ఈడిగపల్లె జట్టు కెప్టెన్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

జగన్ జిమ్మిక్కులు సాగవు : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

ప్రజాబలంతో గెలిచే ధైర్యం లేక బోగస్ ఓట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న జగన్ జిమ్మిక్కులు ఇక చెల్లవని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పీలేరు పట్టణంలోని పాత బస్టాండ్, నెహ్రూ బజార్, బ్రాహ్మణ వీధి ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని, 2024 ఎన్నికల్లో టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. జగన్ ఐదేళ్ల పరిపాలనలో ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాలు, ఇంటి పన్ను, చెత్తపన్నుల భారం ప్రజలపై మోపి వ్యవస్థలను సర్వనాశనం చేశారని తెలిపారు. మరోసారి తప్పుడు మార్గంలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న జగన్ ఆటలు ఇక సాగవని, ఆయన పాలనంతా ప్రజల్ని దోచుకోవడం, తాడేపల్లిలో దాచుకోవడమేనని ఆరోపించారు. పీలేరు పట్టణంలో కిషోర్ కుమార్‌రెడ్డి రాకతో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ ప్రచారం జోరందుకుంది. పలు వీధుల్లో అయనకు ప్రజలు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఆయనతో పాటు టిడిపి, జనసేన నాయకులు, మహిళా సంఘాలు పాల్గొని పట్టణంలో నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పీలేరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్ కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని కిషోర్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి శ్రేణులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న శారద

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యా రంగంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌జిఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి శారద పేర్కొన్నారు. 27, 28వ తేదీలలో రైల్వేకోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్ 14, 17, 19 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో టంగ్ టా మార్షల్ ఆర్ట్స్ నందు కోచ్ కొన్నిపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శారదతో పాటు పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ ప్రసాద్‌లు పాల్గొని క్రీడా పోటీలు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా ఇస్తాయని అన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు సుబ్బరాజు, అసోసియేషన్ సభ్యులు రవిశంఖర్, కొన్నిపాటి వెంకటేష్ మాట్లాడుతూ ఈ పోటీలలో అండర్-14 బాలుర విభాగంలో కె.హేమంత్ నారాయణ, ఎం.వి.గోకుల్ నందన్, డి.నోయల్ స్టర్లిన్‌లు ఎంపికయ్యారని తెలిపారు. అండర్ -17 బాలుర విభాగంలో ధ్రువన్ కుమార్, గౌతమ్ కుమార్, సంతోష్‌రెడ్డి, చరణ్ జెర్‌లోన్, లోకేశ్వర్‌రెడ్డి ఎంకయ్యారని చెప్పారు. బాలికల విభాగంలో ఎం.హర్షిత, అండర్ -19 బాలుర విభాగం లో చరణేశ్వర్ రాజు, ఉపేంద్ర, లోక నితిన్ కుమార్, సాయియోగేష్, ముని చైతన్య, మునిసాయి శరణ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు జనవరి 10 నుంచి 16 వ తేదీ వరకు ఢిల్లీలోని ఛత్రశాల్ స్టేడియంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయిలో కూడా మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

'వాచర్' కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రొడక్షన్ వాచర్ గోపాల్ మృతదేహానికి గురువారం ఫారెస్ట్ అధికారులు కడప డిఎఫ్ఒ వివేక్, అన్నమయ్య డిఎఫ్ఒ నాగమనేశ్వరి, రాయచోటి రేంజ్ అధికారి స్ఫూర్తి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. వీరి వెంట రాయచోటి సెక్షన్ ఆఫీసర్ రఘు, శంకర్, రాయచోటి రేంజ్ ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న ప్రకాష్, అధికారులు

భూగర్భ నీటి నిల్వ పనులు పరిశీలన

ప్రజాశక్తి-చిన్నమండెం

భూగర్భ జలాలను పెంపొందించేందుకు దిగువగొట్టివిడులో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ సోక్ పిట్‌ను , దేవుడిపల్లెలో బోర్వెల్ రీఛార్జ్ పనులను గురువారం సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్‌కిచ్చి, ఎఎస్.పవార్‌లు తనిఖీ చేశారు.జిల్లాకు సంభవించిన కరువు పరిస్థితుల గురించి రాయచోటి ఎపిడి రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దివ్య, ఎపిఒ మాధవి, జెఇ హారున్‌బాషా, క్లస్టర్ టిఎలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దేవరకొండ శ్రీకనకదుర్గమ్మ దేవస్థాన సమీపంలోని ద్రేవరకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం, మహా పాదయాత్ర కార్యక్రమాన్ని వైభంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముక్కారూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత కుమారుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణోత్సవరంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, కృష్ణయ్య నాయుడు, రమేష్‌నాయుడు, పెంచల్‌నాయుడు, బలరాంనాయుడు, నాగరాజా, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ అరవశ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయానికి భూమిపూజ చేస్తున్న జయచంద్రారెడ్డి

ఆలయాల అభివృద్ధికి కృషి : 'దాసిరిపల్లి'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లిలోని ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని టిడిపి నేత, ప్రముఖ పారిశ్రా మికవేత్త దాసిరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పెద్దతి ప్పస ముద్రం మండలం, బూర్లపల్లిలో పర్యటించి ఆలయం నిర్మాణం భూమిపూజలో పాల్నొన్నారు. ఆలయ అభివృద్ధి కొరకు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ రాముని ఆలయ నిర్మాణానికి తనవంతు బాధ్యతగా రూ.5 లక్షల విరాళాన్ని అందించానని, రాజకీయాలకు సంబంధించినది కాదని అన్నారు. గ్రామంలో ఎవరికి ఎటువంటి సాయం కావాలన్నా రాజకీయా లకతీతంగా తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎం.వెంకట్ర మణారెడ్డి, ఎం.ఎన్.వెంకట్రమణారెడ్డి, చంద్రారెడ్డి, ఎస్.బయ్యారెడ్డి, ఎ.మాధవరెడ్డి, నక్క కిట్టన్న, నాగరాజురెడ్డి, ఎం.సోమశేఖర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి
O.S.NO:294/2019
Between:
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు Rep by its Senior Manager, Kadiri ...Plaintiff
మరియు
D.2:బండి పద్మజ W/o దామోదర్ రెడ్డి,R/at Near బస్ స్టాండ్, మదనపల్లి పట్టణము మరియు మండలము, శ్రీ అన్నమయ్య జిల్లా. ...Defendants
పై దావాలోని D.2 ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలో వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు) ప్రతివాది D2 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 02/01/2024వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 02/01/2024వ తేది ఉదయం 10:30 గంllలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా:02/01/2024
స్థలం:కదిరి
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
రాజంపేట
E. P. No. 116/2012
in
O S No: 87/2009
స్టేట్ బ్యాంకు అఫ్ హైదరాబాద్, ప్రస్తుతం స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, రాజంపేట బ్రాంచ్ రెప్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్. ...Dhr/వాది
వర్సస్
సయ్యద్ కాలిద్, తండ్రి అమీర్ జాన్, అప్పాయ్యరాజుపేట గ్రామము & పోస్ట్, పుల్లంపేటమండలం, అన్నమయ్య జిల్లా. ...J. Dr. No.2/ప్రతివాదులు
నోటీసు
వాది/D.Hr, ఇ.పి పైకము వసూలు నిమిత్తం, ఇ.పి షెడ్యూల్ ఆస్తిని విక్రయించి పొందుటకు దాఖలు చేసిన ఇ.పి. 24/01/2024వ తేదీ ఉదయం 10:30 గంటలకు వాయిదా ఉన్నది, మీరు కోర్టుకి హాజరై అక్షేపణలు తెలపని యెడల కోర్ట్ వారు మీ పరోక్షమందు ఇ.పి.ని తీర్మానించబడును.
//బై ఆర్డర్ అఫ్ ది కోర్టు//
యస్ రవీంద్ర
వాది అడ్వకేట్,
రాజంపేట.

కుష్టు నిర్మూలన మనందరి బాధ్యత

ప్రజాశక్తి-పీలేరు

కుష్టువ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు ప్రజలు అందరూ సహకరించాలని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాండ్ల గ్రామంలో స్పర్శ లేని మచ్చలు కుష్టువ్యాధి కావచ్చు అనే అంశంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మైక్రో బ్యాక్టీరియాలెప్రే అనే క్రిమి వల్ల వచ్చే కుష్టువ్యాధి ఇతర అంటు వ్యాధుల్లాంటిదని, కుష్టువ్యాధి నిర్ధారణ అయ్యాక, చికిత్స సక్రమంగా తీసుకుంటే ఏ దశలో ఉన్నా పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. బహుళ ఔషధ చికిత్సతో పూర్తిగా నివారణపొంది, సామాజిక జీవనం గడపవచ్చని తెలిపారు.ఈ చికిత్స అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా లభిస్తాయని చెప్పారు. శరీరంపై పాలిపోయిన, ఎరుపు లేదా రాగి వర్ణంగల, స్పర్శ లేని మచ్చలుంటే మీ ఇంటి దగ్గరకు వచ్చి సర్వే నిర్వహిస్తున్న సామాజిక ఆశ కార్యకర్తలకు చెప్పి వ్యాధి నిర్ధారణలో సహకరించి, కుష్టు

పీలేరు : కుష్టుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

వ్యాధి రహిత సమాజానికి చేయూత నివ్వండని ప్రజలను కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, యంపిహెచ్ఇఒ శ్రీను, ఏఎన్ఎం కరీమున్నిసా, డిఇఒ నాగసుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన పోస్టర్లను డాక్టర్ ముద్దా రామసుబ్బారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 12వ తేదీ వరకు ప్రతి గ్రామంలో కుష్టు వ్యాధి పై సర్వే జరుగుతుందని తెలిపారు. ఆశా కార్యకర్తలు, వాలంటరీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎం ఎల్‌హెచ్‌పిలు పాల్గొని ప్రతి కుటుంబం లోని వ్యక్తులు అందరిని పరీక్షించి స్పర్శ లేని మచ్చలను గుర్తించి ప్రతిరోజు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో నివేదికను అందించాలని తెలిపారు. ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు ప్రతిరోజూ ఇంటింటి సర్వే నిర్వహించాలని తెలిపారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణ నిర్మూలనపై పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్, డాక్టర్ సానే శేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లంపేట: కుష్టుపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పీలేరు

కాంగ్రెస్ పార్టీ139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పీలేరులో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుబ్బా శ్రీకాంత్ ఆధ్వర్యంలో పీలేరులో కేక్‌కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం తెచ్చి పెట్టింది కాంగ్రెస్‌పార్టీ అని అన్నారు. స్వాతంత్రం వచ్చిన అనంతరం కూడా భారతదేశ నిర్మాణంలో అనేక విప్లమాత్మక మార్పులు తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. ప్రపంచ దేశాలకు ధీటుగా భారతదేశాన్ని అభివృద్ధి చేసిందని చెప్పారు. దేశంలోని ప్రతి గ్రామానికీ కరెంటు ఇచ్చిన ఘనత, ఐఐటిలు, ఎన్ఐటిలు ఎయిమ్స్ ఎల్ఐసి బ్యాంకుల జాతీకరణతో పాటు దేశవ్యాప్తంగా ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని అన్నారు. ఉపాధి హామీ పథకం, ఆర్‌టిఐ చట్టాలు, ఎస్‌టి, ఎస్‌సిలకు ప్రత్యేక సబ్ ప్లాన్ నిధులు, ఏపి రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, ఫీజు రీయింబర్స్మెంట్, రాజీవ్ యువకిరణాలు, ఒక్క రూపాయికే కిలో బియ్యం ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఒబిసి ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సంపత్‌కుమార్, జిల్లా కార్యదర్శి యూసుఫ్, కలికిరి మండల అధ్యక్షులు రహంతుల్లా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లాయర్ చాంద్ బాష, విశ్రాంత తహశీల్దారు బసవయ్య, జనార్ధన్, ఎర్రయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రైల్వేకోడూరు ఇన్‌చార్జి గోసాల దేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం కొత్త భారతదేశ ఆవిష్కరణకు నాంది అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ శాంతయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, పుల్లంపేట మండల అధ్యక్షుడు సిగమాల రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు సిగమాలరవి, కొరముట్ల రాము, కసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చేపల లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు. **రామసముద్రం :** మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ కూడలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగం రామ కృష్ణారెడ్డి చేతులు మీదుగా కాంగ్రెస్ పార్టీ జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పూర్వవైభవానికి కార్యకర్తలు సమిష్టిగా పార్టీ అభివృద్ధికి

కలికిరి : ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కృషి చేయాలని కోరారు. మదనపల్లి నియోజకవర్గం కిసాన్ మజ్దూర్ అధ్యక్షుడు గంగిరెడ్డి, మండల అధ్యక్షులు ఖాదర్ బాషా, శ్రీదేవి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. **రాయచోటి :** భారతజాతి దాస్య శృంగాలాలను దించి స్వతంత్ర భారత వానికి దిశా దశలను విదేశించిన కాంగ్రెస్ పార్టీ అని డిసిసి అధ్యక్షుడు షేక్ అల్లాబకాష్ అన్నారు. కాంగ్రెస్‌పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి జెండా ఎగుర వేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మకమైన నిరుద్యోగ సమస్య, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ధరల పెరుగుదల,దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పతనం కారణంగా దేశం మొత్తం బాధతో ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి,బిసి,మైనార్టీ వర్గాల పైన దాడులు పెరిగిపోయాయని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశం బాగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షుడు రఫీ, డిసిసి ఆర్గనైజేషన్ సెక్రెటరీ అమీర్ బాషా, జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు దర్బార్ భాష, ఆఫ్రిన్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు చెన్నక్రిష్ణ, జిల్లా సెక్రెటరీ బషీర్ అహ్మద్, జనరల్ సెక్రెటరీ చాన్ భాషా, మండల అధ్యక్షులు రమణ, రమణమ్మ, నాగలత,విజయ, హేమలత, పాల్గొన్నారు. **కలికిరి:** స్థానిక కలికిరి ఇందిరమ్మ విగ్రహం ఆవరణంలో కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వర్ధన్ చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగం రామకృష్ణారెడ్డి, లీల శ్రీనివాస్, ఎస్ఎండి గౌస్, శ్రీదేవి, సైదా, పరేసి, శివ రాజశేఖర్, వెంకటేష్ తిరుమ, ఏసు, కిషోర్, వేణు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాములో ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పౌరసరఫరాల గోదామును ఆర్‌డిఒ రంగస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగకు ముందే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాల అన్నారు. గోదామును పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. ఏఏ వస్తువులు ఏఏ సమయంలో పంపిణీ చేశారని పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాల నిత్యావసర సరుకులు బియ్యం, పంచదార, కందిబేడలు, పామాయిల్ పౌష్టికాహార కిట్లు అందుబాటులో ఉన్నా యని డిటి తెలిపారు. గోదాములో మొత్తం బియ్యం 290,046 మెట్రిక్ టన్నులు, పంచదార 31500 మెట్రిక్ టన్నులు, కందిపప్పు 3405 మెట్ టన్నులు, గోధుమపిండి 36670మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని మూడు మండలాల రేషన్‌షాపులకు పంపిణీ చేయాలని అన్నారు. సంక్రాంతి పండగకు లబ్ధిదారు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిత్యవసర సరుకులు పం

గోదాములో నిల్వవుంచిన సరుకులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రంగస్వామి

పిణీ చేయాలని తెలిపారు. ఈ నెల 31 లోగా రేషన్ షాపు సరుకులు అందించాలని తహశీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, డిటి మల్లికార్జునకు సూచించారు.

దొడ్డిపల్లెలో మాతా శిశు సంరక్షణ సేవలు

మాతా శిశు సంరక్షణ పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని దొడ్డిపల్లెలో మాతాశిశు సంరక్షణ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా నోడల్ అధికారి రియాజ్ బేగ్ తెలిపారు. జిల్లా నోడల్ టీమ్, జిల్లా స్టాటికల్ ఆఫీసర్ జి.ఓబుల్ రెడ్డి, ఎఎస్ఒ పి.రాజేష్. ఎన్‌హెచ్‌ఎం కె.మునీశ్వర, వైద్యాధికారి యం.వి. కిషోర్‌కు మార్‌రెడ్డి, డాక్టర్ పి. జవహర్‌బాబుల ఆధ్వర్యంలో మాతా శిశు సంరక్షణ సేవలు, ఆన్‌లైన్ డేటా, రికార్డుల పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు హిమగ్లోబిన్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. కత్తివారిపల్లెలో పాఠశాల విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో ఎంపి హెచ్ఇఒ జి. జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ, సూపర్వైజర్ బి.రెడ్డమ్మ, షేక్.ఇస్మాయిల్, ఆరోగ్య కార్యకర్తలు సి.లక్ష్మీదేవి. డి.వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలి

- కలెక్టర్ పి.ఎస్.గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ పథకాల అమలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, తదితర పథకాల అమలుపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్ కానుక, చేయూత, ఆసరా పథకాలను పండుగ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పథకాలకు సంబంధించి ఒక షెడ్యూల్ రూపొందించుకొని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పథకాలకు ఆయా నియోజకవర్గాలలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకొని షెడ్యూల్ ప్రకారం వెళ్లాలన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఒక ఉత్సవంలాగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 8 వరకు పెన్షన్ కానుక, 28న ఆసరా, ఫిబ్రవరి 5న చేయూత పథకాలు ప్రారంభిస్తారని చెప్పారు. పథకాలకు సంబంధించి గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వారిని భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు.

ప్రకటన
మా కక్షిదారులైన పాల వెంకట రమణ బార్య మాలె కల్పన గారి బరిజినల్ దస్తావేజులు ఎస్.యన్. కాలిని నుండి ఆటోలోని బస్టాండుకు పోతూ ఉండగా దారి మధ్యలో ఆమె దస్తా వేజులు పోయినవి. పోయిన దస్తావేజుల వివరాలు
DOC.NO. 1663/2012. తేది: 5-3-2012.
పై దస్తావేజులు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు చేర్చవలయునని మనవి. చేర్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.
ఇట్లు
పగడాల శ్రీనివాసులు, BA., BL.,
న్యాయవాది మరియు నోటరి,
Cell No-9059398112. రాయచోటి.

బాధితులకు చెక్కును అందిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

బాలుడి శస్త్రచికిత్సకు రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మండల పరిధిలోని ఎర్రగుంటకోట గ్రామానికి చెందిన షేక్ అహ్మద్, అయేషాల కుమారుడు షేక్ అనాస్‌బాషా కిడ్నీ శస్త్రచికిత్స కోసం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత కుమారుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో నిరుపేద కుటుంబాల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నాంటూ సాయివికాస్‌రెడ్డి ఆపన్నహస్తం అంది స్తున్నారని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో సానగారి విశ్వనాథరెడ్డి, షేక్ ఇస్మాయిల్ బాషా, షేక్ హమీమ్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

'అన్నమాచార్య'లో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో భారత దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దడం ఎలా అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యా పి.జాహ్నవి ప్రథమ బహుమతి సాధించగా, టి.శ్రావణి ద్వితీయ బహుమతి, డి.నేహారెడ్డి తృతీయ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వినారాయణలు అభినందించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ నేటి పౌరుల చేతిలో రేపటి భారత దేశ భవిష్యత్తు ఉందని, వారు కష్టపడితే భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మలచవచ్చని అభిప్రా యపడ్డారు. కార్యక్రమంలో హెచ్‌అండ్ఎస్ హెచ్ఒడి డాక్టర్ బి.బాల నాగేంద్రప్రసాద్, టచ్ స్టోన్ ఇన్‌ఛార్జి విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

చెత్త నుంచి సంపద సృష్టించాలి : డిపిఒ

ప్రజాశక్తి-చిన్నమండెం

చెత్త నుంచి సంపదను సృష్టించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని డిపిఒ ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మల్లూరు, సాకిబండ గ్రామాలలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలను డిపిఒ తనిఖీ చేశారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు ఎరువులను తయారు చేయాలన్నారు. ఎరువులను రైతులకు విక్రయించి వచ్చే రాబడిని గ్రామాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, పిఎస్‌లు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రకు తరలివెళ్లిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-చిన్నమండెం

జిల్లా కేంద్రం రాయచోటిలో వైసిపి నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని పలు గ్రామాల నుంచి వైసిపినాయకలు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తున్నారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ వర్గాల ప్రజలు వైసిపి ప్రభుత్వ పాలనపై సంతృప్తితో ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరల ముఖ్యమంత్రి అయ్యేందుకు తామంతా కలసి కట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేసేందుకు తరలి వెళుతున్నామని పేర్కొన్నారు.

'సంకల్పయాత్ర'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుర్రంకొండ

వీక్షిత్ భారత్ సంకల్పయాత్రను జయప్రదం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి ప్రకాష్ కిచ్చి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరుగుతున్నదని తెలిపారు. ఈ యాత్రలో మండలం స్పెషల్ ఆఫీసర్, జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారులు పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన తెలిపారు. ఎంపిడిఒ, తహశీల్దార్, మండల అధికారులతో సమీక్ష సమావేశం ఉంటుందని తెలిపారు.

పట్టుబడిన మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ రూ.3.56లక్షలు విలువచేసే మద్యం బాటిల్స్‌తో పాటు సీజ్ చేసిన నాటుసారాను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్‌పి బి కృష్ణ రావు ఆదేశాల మేరకు ఎస్‌సిబిఇఎస్ వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పట్టుబడ్డ మద్యం బాటిళ్లను, సీజ్ చేసిన నాటుసారాను పట్టణ పరిధిలోని రోడ్ రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరమని అలాంటి వారికి కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బుల సంపాదన కోసం అత్యాశకు పోయి అక్రమ మార్గాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జైలుపాలు కావద్దని సూచించారు. ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఎఇఎస్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు